www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024

'గండి' ఇఒపై కమిషనర్‌కు ఫిర్యాదు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి దేవస్థానం ఇఒగా పనిచేస్తున్న ముకుందా రెడ్డి అవినీతి అక్రమాలపై విచారించాలని దేవాదాయ కమిషనర్‌కు శుక్రవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. గండి దేవస్థానంలో ఐదు సంవత్సరాలుగా అనేక అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నా, అర్హత లేకున్నా ముకుంద రెడ్డిని ఇఒగా నియమించారని పేర్కొన్నారు. వారు ఇష్టానుసారంగా అక్రమాలకు చేశారన్నారు. ఉచిత అన్నదానం కోసం భక్తులు ఇచ్చిన విరాళాలను గండి దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా ఇఒ తన ఖాతాకు జమ చేసుకొని దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున వెంటనే విజిలెన్స్ విచారణ జరిపి కఠినమైన చర్యలు తీసుకోవాలని దేవాదాయ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.

సాగునీటి ప్రాజెక్టు పనులకు బ్రేక్

రూ.924 కోట్ల బిల్లులు పెండింగ్
ఆరు నెలలుగా పనులు నిలిపివేత
చేతులెత్తేసిన ఇరిగేషన్ ఇంజినీర్లు

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనులకు గ్రహణం పట్టింది. జిల్లా సాగునీటి పారుదల శాఖలో భారీగా పేరుకుపోయిన పెండింగ్ బిల్లుల చెల్లింపులే పనుల నిలుపుదలకు కారణమనే వాదన వినిపిస్తోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1, ఫేజ్-2, సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల ఆధునికీకరణకు సుమారు రూ.12 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. జిఎన్ఎస్ఎస్ ఆధునికీకరణ, నూతన రిజర్వాయర్ల నిర్మాణం, తెగిన రిజర్వాయర్ల పునరుద్ధరణ, పలుఎత్తిపోతల పనులు, ఎల్ఎ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.924 కోట్లు మేరకు అభివృద్ధి పనులు చేపట్టారు. ఏడాది కిందట రూ.139 కోట్ల చెల్లింపులు చేయడం మినహా మిగిలిన బిల్లులు చేయకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిధిలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2లోని ప్యాకేజ్-1 కింద నాలుగేళ్ల కిందట రూ.5,030 కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం పనులు చేపట్టారు. 6.5 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో తలపెట్టిన మూడు కొత్త రిజర్వాయర్లలో రెండింటిని పూర్తి చేసినట్లు తెలుస్తోంది. రాయలసీమ కరువు రక్కసిని పారదోలేందుకు ఉద్దేశించి రాయలసీమ డ్రౌట్‌మిటిగేషన్ ప్రాజెక్టు (ఆర్‌డబ్ల్యుఎంపి) మొదలుకుని పలు ప్రాజెక్టుల పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. 2024 మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేతులు మారడం సాగునీటి ప్రాజెక్టుల పనులకు శాపంగా మారినట్లు కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనులు చేపట్టిన 15 కాంట్రాక్టు కంపెనీలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా ఆధారంగా పనుల్ని నిలిపేయడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు, తర్వాత సుమారు నాలుగు నుంచి ఆరు నెలలుగా పనుల్ని నిలిపేయడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారిపోయింది. జిల్లాలో కాంట్రాక్టు పనులు దక్కించుకున్న కంపెనీల్లో ప్రధానంగా మెయిల్, పిఎల్ఆర్-ఎన్ఇసిఎల్, పిఎల్ ప్రాజెక్ట్స్, ఎంఆర్‌కెఆర్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్, విపిఆర్, రిత్విక్, మాక్స్ ఇన్‌ఫ్రా, ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, కెఎంవి, ఆర్‌విఆర్, ఎస్ఎల్ఆర్ ఇన్‌ఫ్రా, రత్న ఇన్‌ఫ్రా, మైథాస్ ఎన్‌సిసి వంటి కాంట్రాక్టు కంపెనీలు ఉన్నాయి. ఏడు కంపెనీలు ఐదేళ్లుగా తట్టెడు మట్టి ఎత్తిపోసిన దాఖలాలు లేవని వాదన వినిపిస్తోంది. బిల్లుల చెల్లింపులు నిలిచిపోయిన నేపథ్యంలో ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం బడా కాంట్రాక్టు కంపెనీలతో పనులు చేయించలేక చేతులెత్తిసినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం స్పందించి పోలవరానికి పరిమితం గాకుండా జిల్లా సాగు నీటి ప్రాజెక్టు పనులను పరుగులు తీయించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలి

డిఇఒకు యుటిఎఫ్ జిల్లా శాఖ వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సబ్జెక్టు ఉపాధ్యాయుల స్థానంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతలు కల్పించాలని, అప్పటివరకు తాత్కాలిక పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం డిఇఒ ఎం.అనురాధను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పాఠశాల సహాయకులు ఉద్యోగ విరమణ చేశారని పేర్కొన్నారు. ఆ కారణంగా సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా విరమణ పొందిన వారి స్థానంలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలలో విద్యార్థులకు బోధన కుంటుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ప్రభావం 10వ తరగతి విద్యార్థులపై పడే ప్రమాదం ఉందన్నారు. విరమణ పొందిన వారితో పాటు, దీర్ఘకాలిక సెలవులు, ప్రసూతి సెలవులు పెట్టిన వారి స్థానంలో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను నివారించడానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతవరకు తాత్కాలిక ప్రాతిపదికన పని సర్దుబాటు చేసైనా సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ స్పందిస్తూ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానంలో తాత్కాలికంగా పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమిస్తామని, ఉద్యోగోన్నతుల విషయం రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చాల్సిందిగా ఇప్పటికే ఉపవిద్యా శాఖ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, నాయకులు యడాల సురేష్ కుమార్, గాజుల పల్లె గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ట్రిపుల్‌ఐటి ప్రవేశానికి 53,863 మంది దరఖాస్తు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నూజివీడు, ఇడుపులపాయి, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల్లో ఆరేళ్ల సమీకృత బిటెక్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కోసం 53, 863 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆర్‌జెయుకెటి అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు దరఖాస్తులు చేసుకొనేందుకు ఆఖరు గడువు ముగిసిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వాటిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రయివేటు పాఠశాలల నుండి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుండి 38 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో బాలికలు 30,857 మంది, బాలురులు 23,006 మంది న్నారని పేర్కొన్నారు. ప్రత్యేక కేటగిరీలో సైనిక సంతతి విభాగంలో 2,582 మంది, ఎన్‌సిసి విభాగంలో 1830 మంది, క్రీడాల విభాగంలో 1162 మంది, విభిన్న ప్రతిభావంతుల విభాగంలో 332 మంది, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఎన్‌సిసి, క్రీడలు, విభిన్న ప్రతిభావంతుల కేటగిరిలో దరఖాస్తులు చేసుకున్న వారికి నూజివీడు క్యాంపస్‌లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని తెలిపారు. సైనిక సంతతి (క్యాప్) జులై 1 నుంచి 3వ వరకు సర్టిఫికెట్లు పరిశీలన ఉండగా ఎన్‌సిసి, క్రీడా విద్యార్థులకు 3 నుంచి 5 వరకు, విభిన్న ప్రతిభావంతులకు 3వ తేదీన, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు 2 నుండి 3వ తేది వరకు సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందన్నారు. క్యాంపస్‌ల వారిగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితా జులై 11న విడుదల చేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన నూజివీడు, ఇడుపులపాయి(ఆర్కే వ్యాలీ) ప్రాంగణంలో జులై 22, 23 తేదీల్లో ఒంగోలు, ఇడుపులపాయ ప్రాంగణంలో జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం ప్రాంగణంలో 26,27 తేదీల్లో ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏదైనా కారణం చేత ప్రత్యేక కేటగిరి సర్టిఫికేట్ పెట్టడం మర్చిపోయిన వారి సంబంధిత సర్టిఫికెట్ తీసుకొని కేటాయించిన ఆయా తేదీలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఆర్‌జెయుకెటి నూజివీడు క్యాంపస్‌కు రావాలని కోరారు. అభ్యర్థి మెరిట్, కేటగిరి ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులో ఇచ్చిన ప్రాధాన్యత ఆధారంగా క్యాంపస్ కేటాయిస్తారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను అడ్మిషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత క్యాంపస్‌ల మధ్య అభ్యర్థుల అంతర్గత బదిలీ ఉండదని తెలిపారు.

అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-చక్రాయపేట

మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందిన కౌలు రైతు గడ్డం రాజా(44) అప్పులబాధతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు.... కుమారకాల్వకు చెందిన ఏసయ్య కుమారుడు గడ్డం రాజా ఐదు ఏకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను సాగు చేశారు. పంటల సాగు కోసం ప్రయివేటు వ్యక్తుల వద్ద రూ.10 లక్షలు అప్పులు చేశారు. అప్పులు తీర్చలేక, ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో శుక్రవారం వేంపల్లెలోని ఐటిఐ వెనుక భాగంలో రాజా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన వెంటనే మృతుడు రాజా బంధువులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్న విషయం చెప్పారు. వెంటనే బంధువులు సంఘటన స్థలానికి వెళ్లే సరికి రాజా మృతి చెంది ఉన్నారని చెప్పారు. మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సునీతతో పాటు తల్లి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజా ఆత్మహత్య చేసుకోవడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియడంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్రలు వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు.

మృతదేహాన్ని సందర్శిస్తున్న టిడిపి నాయకులు

రాజంపేటకు ఇన్‌ఛార్జిగా అధిష్టానం ఎవరినీ నియమించలేదు

- టిడిపి యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి ఒంటిమిట్ట

రాష్ట్ర టిడిపి అధిష్టానం రాజంపేట నియోజకవర్గానికి ఎవరిని ఇన్‌ఛార్జిగా నియమించలేదని తెలుగుదేశం కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, టిడిపి యువ నాయకులు మేడా విజయశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక హరిత హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మేడా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేట తెలుగుదేశం పార్టీలో కొన్ని తప్పిదాలు జరిగినందు వల్ల రాజంపేట నియోజవర్గంలో పార్టీ డిపోయిందని ఆయన అన్నారు. ఇప్పుడైనా అధిష్టానం ఈ విషయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఇప్పటికీ వైసిపి నాయకులు దౌర్జన్యాలు ఆగడం లేదని, అధికారులు కూడా వారికి అంతా వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. వెంకట నరసయ్య మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో టిడిపి తరఫున పోటీ చేసిన సుగువాసి బాలసుబ్రమణ్యం ఓడిపోవడానికి ఆయనే కారకుడని అన్నారు. ఆయన ఎన్నికల సమయంలో ఏ ఒక్క మండలంలోనూ పూర్తి స్థాయిలో ప్రచారం నిర్వహించలేదని పేర్కొన్నారు. బాలసుబ్రమణ్యానికి సీనియర్ నాయకులు కొన్ని సలహాలు సూచించినప్పటికీ వాటిని పాటించకపోవడం వల్ల ఓడిపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు సుబ్రహ్మణ్యం రాజం పేట, నందలూరు మండలాల్లో సమావేశాలు పెట్టి తానే ఇన్‌ఛార్జిని అని ప్రకటించుకోవడం వల్ల నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలు సందిగ్ధంలో పడ్డారని వాపోయారు. ఇప్పటికైనా అధిష్టానం కలుగ చేసుకొని ఒక సమర్థవంతైన నాయకుడని ఇన్‌ఛార్జిగా నియమించాలని విన్నవించుకొన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది, సీనియర్ నాయకులు రామదాసు, మోదుగులు నరసింహులు, పలుకూరు, దత్తాత్రేయలు, రఘురామిరెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి-కడప అర్బన్

తమ కళాశాలలో క్లైమేట్ చేంజ్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ అగ్రికల్చర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్మహించడం అభినందించదగ్గ విషయమని ప్రిన్సిపల్ డాక్టర్ వి. సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఐక్యూఎసి ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం నుంచి ప్రొఫెసర్ ఎం.అనిత, తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సి.అన్నపూర్ణ, తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో స్వయం ప్రతిపత్తి గల గిరిరాజు ప్రభుత్వ కళాశాల నుంచి డాక్టర్ ఎ. ఆదెప్ప గూగుల్ మీట్ ద్వారా హాజరయ్యారు. అమూల్యమైన సలహాలను సూచనలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ప్రాధాన్యత గల దేశమని, అధిక జనాభా వ్యవసాయ రంగం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసినట్లయితే భారతదేశ అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు సదస్సు లో కన్వీనర్ డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, కో కన్వీనర్ డాక్టర్ సివి, కృష్ణవేణి, ఆర్గనైజింగ్ సెక్రట రీలు డాక్టర్ గురు మోహన్ రెడ్డి, డాక్టర్ కె.శాలిని, డాక్టర్ పి. సచిదేవి, డాక్టర్ ప్రకాష్ నారాయణ రెడ్డి,రిసోర్స్ పర్సన్స్ ప్రొఫెసర్ ఎం. అనిత, సి.అన్నపూర్ణ, డాక్టర్ డి. ఆదెప్ప కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'నేను బడికి పోతా' : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి విద్యార్థి చదువుకోవాలని 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని డిఇఒ మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ నుంచి 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పాఠశాల నుంచి ప్రారంభమై కృష్ణ సర్కిల్ మీదుగా ఆకుల వీధి పాఠశాల వరకు సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 12 వరకు నెలరోజులపాటు నేను బడికి పోతా అనే కార్యక్రమం ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల ద్వారా 6 నుంచి 14సంవత్సరాల లోపు ప్రతి విద్యార్థి పాఠశాలల్లో చదువుకోవాలన్నదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. బడి మధ్యలో మానేసిన విద్యార్థులు, తరచు బడికి రాకుండా ఉండే విద్యార్థులను, ఇప్పటివరకు పాఠశాలో నమోదు కాని విద్యార్థులను ఉపాధ్యాయులు గ్రామ వార్డు సచివాలయంలోని విద్యా కార్యదర్శి ద్వారా సమాచారాన్ని సేకరించాలని చెప్పారు. సిఆర్ఎంటి సహకారంతో విద్యార్థులను పాఠశాల చేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప ఎంఇఒ పాలెం నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, సమగ్ర శిక్ష ఎఎల్ ఎస్ కో-ఆర్డినేటర్ చల్లా విశ్వనాథ్ రెడ్డి, ఎఎంఒ రామాంజనేయులు రెడ్డి, పాఠశాల చైర్మన్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, సి ఆర్ ఎం టి కృష్ణ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు పాఠశాలలో ఉండాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-చెన్నూరు

బడి బయట పిల్లలకు పాఠశాలలోనే ఉండాలని ఎంఇఒ గంగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్న, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు విద్యప్రవేశం, నేను బడికి పోతా అనే కార్యక్రమంపై జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యప్రవేశం అనే కార్యక్రమం ఐదేళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎలా ఉంది, విద్యార్థులకు బోధన విధానం ఎలా ఉంది, అనే విషయాలపై దీక్ష యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి- 2 సునీత జిల్లా అకాడమిక్ నానిటరీ అధికారి రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైల్ అధికారి దశరద రామిరెడ్డి, ఎఎల్ఎస్‌సిఒ విశ్వనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-అట్లూరు : చిన్న,సన్న కారు రైతులకు పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఉపాధి హామీ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ మల్లేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అట్లూరు ఉపాధి హామీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జామ, మామిడి, చీని , సన్న నిమ్మ ,సపోటా, సీతాఫలం, ఉసిరి ,దానిమ్మ ఒంటి పండ్ల తోటలు పెంపకంనకు ఆసక్తి గల చిన్న ,సన్న కారు రైతుల నుండి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబానికి 5 ఎకరాలు లోపు భూమి కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల రైతులు తమ భూమికి సంబంధించి వన్‌బి అడంగల్, భూమి పాస్ బుక్‌తో ఎపిఒను, ప్లాంటేషన్ సూపర్‌వైజర్‌ను 9000 89 1246లో సంప్రదించాలన్నారు.

పూడికలు తీయించండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని దొండపాడు రస్తాలో ఉన్న డ్రెయినేజీ కాలువలలో పూడికలు తీయించాలని జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ జగదీష్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యను కోరారు. శుక్రవారం ఉదయం కమిషనర్ రామకృష్ణాయతో కలిసి జగదీష్ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ కాలువలలో పూడిక తీయకపోవడం కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు విపరీతంగా వ్యాప్తి చెందడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. పూడికలు తీయని కారణంగా ఎక్కువ మోతాదులో వర్షం కురిసినప్పుడు కాలువలు పొంగి రోడ్లపై మురుగునీరు పారుతున్నాయని కమిషనర్‌కు తెలిపారు. స్థానికులు కమిషనర్‌కు పలు సమస్యలను తెలియజేశారు. సమస్యలు పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామకృష్ణయ్య హామీ ఇచ్చారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపిడిఒ జాషువ, కమిషనర్ రామకృష్ణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో పెన్షన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో శుక్రవారం అధికారులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ల నగదును నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రతి సచివాలయ ఉద్యోగి 50 మంది లబ్ధిదారులకు మించకుండా పింఛన్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సిబ్బంది కొరత ఉన్నచోట మండల పరిషత్, రెవెన్యూ మున్సిపల్ సిబ్బందిని వినియోగించుకోవాలని తెలిపారు. పింఛన్లకు సంబంధించిన నగదును శనివారం సాయంత్రానికే బ్యాంకు ఖాతా నుండి విత్ డ్రా చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుండి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో సిఐ ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేషరతుగా కేసులు ఎత్తివేయాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్య నారాయణపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురామ నాయుడు, జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని రాజీవ్ మార్గ్‌లో ఉన్న సంఘం కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కొంత కాలం నుంచి రాష్ట్రంలో ఐఎఎస్‌ల నుంచి ఆఫీస్ అబార్డినేట్ వరకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందక, పని భారం పెరిగి ప్రజలలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆత్మాభిమానం దెబ్బతినేలా వ్యాఖ్యలు, చర్యలు అనేకం చూశామని తెలిపారు. ఇటువంటి దయనీయమైన స్థితిలో ఉద్యోగులు, వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఏకైక మనసున్న నాయకుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ అని చెప్పారు. తమ నాయకుడిపై పెట్టిన అక్రమ కేసులన్నీ బేషరతుగా ఎత్తివేయాలి, రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా తమ పరిధి దాటి కేసులు పెట్టి వేదించిన అధికారులను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడప ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, కడప సిటీ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు ప్రభాకరరావు, కమలాపురం తాలూకా అధ్యక్షులు ఓబులేసు, జమ్మలమడుగు తాలూకా అధ్యక్షులు రాజశేఖర్, సిద్ధవటము తాలూకా అధ్యక్షులు మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖా ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రస్తుత ఉరుకు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు విద్యాసాగర్‌రెడ్డి, డయాబెటిస్ వైద్యులు శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ సహకారంతో ఎముకలు కీళ్లు, షుగర్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రెడ్డి సాధారణంగా ప్రతి ఒక్కరిలో వచ్చే ఎముకలకు సంబంధించిన వ్యాధుల గురించి అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ వస్తోందని చెప్పారు. అందుకు కారణం మారుతున్న ఆహారపు అలవాట్లేనన్నారు. ప్రతి ఒక్కరూ రోజు వ్యాయామం చేయాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

అనుమతులు తీసుకునే వైసిపి కార్యాలయ నిర్మాణం

ప్రజాశక్తి - కడప

అన్ని అనుమతులు తీసుకునే వైసిపి కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టామని ఆపార్టీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. కూటమి సుపర్ సిక్స్ పథకాలు వారిని గెలిపించాయని భావించవచ్చన్నారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో టిడిపి నేతలు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయలేదా అని ప్రశ్నించారు. టిడిపి శ్రేణులు వందల కోట్ల రూపాయల స్థలాలను కబ్జా చేసుకుని ఆక్రమించారని తెలిపారు. పాత మున్సిపాల్టీ కార్యాలయ స్థలాన్ని అక్రమించాలని చూశారని, మేయర్‌గా ఆరోజు అడ్డుకున్నామని పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు యాదయ్య పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల కానీ, విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల కానీ ఏమాత్రమూ ప్రేమ ఉన్నా కార్పొరేట్, ప్రయివేటు, పాఠశాలల్లో ఉన్న ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. కడప జిల్లా డిఇఒ, ఆర్‌జెడిని వెంటనే ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా బుక్స్, యూనిఫామ్‌లు, టై, బెల్టులు అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. అయినా ఏ విద్యాసంస్థల పైనా చర్యలు తీసుకోకపోవడం దారుణం అని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర విడనాడి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర నాయకులు ఫర్రోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉప అధ్యక్షులు వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

నేడు అత్యవసర కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమావేశం నిర్వహించేలా అజెండాను సిద్ధం చేసినట్లు కమిషనర్ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలని కమిషనర్ రామకృష్ణయ్య కోరారు.

ఖాసీంఖాన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ ఆడిటర్ సంఘ సేవకులు లయన్ పి. ఖాసీంఖాన్ నివాసానికి టిడిపి ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖాసిం ఖాన్ మాట్లాడుతూ ఒక మహిళా శక్తిగా పోరాట పటిమ కలిగిన ఎమ్మెల్యే మాధవి కడప అసెంబ్లీ అభ్యర్థిగా గెలవడం అసాధారణమని పేర్కొన్నారు. కడప చరిత్రలో మొట్ట మొదటి మహిళా శాసనసభ్యురాలు కావడం, ఆర్. రాజ గోపాల్‌రెడ్డికి ఎనలేని ఖ్యాతి సంపాదించి పెట్టారని కొనియాడారు. భవిష్యత్తు లో రాష్ట్ర, దేశ రాజకీయాలలో శ్రీనివాస్ రెడ్డి, మాధవి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖాసీంఖాన్ కుటుంబ సభ్యులైన పి.మన్సూర్ అలీ ఖాన్, డాక్టర్ తన్వీర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

ఖాసీంఖాన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

పివి నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ఆర్థిక మాంత్రికుడు పివి నరసింహారావు

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ప్రధాని పివి నరసింహారావు ఆర్థిక మాంత్రికుడు, బహు ముఖ ప్రజ్ఞాశాలినని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పీవి నరసింహా రావు 103వ జయంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.వి నరసింహారావు స్వాతంత్ర్య సమరయోధుడు, బహు భాషా కోవిదుడు, తెలుగు బృహస్పతి అన్నారు. ఆరేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా పనిచేసినట్లు చెప్పారు. 20 సంవత్సరాల పాటు శాసన సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రిగా రాష్ట్రానికి సేవ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రిగా విప్లవాత్మకమైన భూ సంస్కరణ చట్టాన్ని తెచ్చారని అన్నారు. ఆరు సార్లు పార్లమెంటు సభ్యునిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానమంత్రిగా ఉండి దేశానికి ఎనలేని సేవ చేశారని తెలిపారు మైనారిటీ ప్రభుత్వాన్ని సమర్ధవంతంగా నడిపిన అపర చాణక్యుడు అన్నారు. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడిన ఆర్థిక మాంత్రికుడు అన్నారు. దక్షిణ భారత దేశం నుంచి తొలిసారి ప్రధాని పదవిని అలంకరించారని చెప్పారు. ప్రధాని పదవిని అలంకరించిన ఏకైక తెలుగు బిడ్డ పివి నరసింహారావు అన్నారు. పివి జీవితం ప్రతి తెలుగు వాడికి, ప్రతి భారతీయునికి ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న రామకృష్ణ, అమర్, శివ, మహబూబ్ బాషా, బద్రి, రాజా పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం-పశువుల ఆసుపత్రి మధ్యగల రోడ్డు గుంతలు ఏర్పడి ప్రజలకు, విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా ఉందని అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో డిఇ బాల మల్లేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు వైపున ప్రమాదాలు కూడా జరిగాయన్నారు. నిత్యం రద్దీగా ఉండడంతో నిత్యం సాయంత్రం, ఉదయం పాఠశాలల వేళల్లో విద్యార్థులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి అధికారులు స్పందించి ఆ రోడ్డుని మరమ్మతు చేయాలని డివైఎఫ్ఐగా కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కృష్ణారెడ్డి, సూరి, దస్తగిరి పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్య సాయం పెంపు హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆలయాల్లో పని చేసే బ్రాహ్మణుల ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు, కార్యదర్శి మురళీధర్ అన్నారు. శుక్రవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ధూప దీప నైవేద్యాలకు రూ.5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచడం సంతోషకరమన్నారు. బ్రాహ్మణుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం సంతోషకరమని చెప్పారు. ఆలయాల్లో పని చేసే బ్రాహ్మణుల విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గత టిడిపి పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు అనేక పథకాలను అమలు జరిగేవని కాబట్టి మళ్లీ టిడిపి ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. దేవస్థానం కమిటీలలో బ్రాహ్మణలకు స్థానం కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

మొక్కను నాటుతున్న మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్

ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రపంచ వృక్ష దినోత్సవం సందర్భంగా వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్ ను ఇవ్వాలని పేర్కొన్నారు. పలు రకాల పూలు, పండ్ల మొక్కలు మామిడి, జామ, కలమంద, నేరేడు, మందార, మల్లె, వేప మొదలగునవి వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబురెడ్డి, సరస్వతీ, ఫార్మసీ అధికారి సుభాషిణి, యుడిసి లోకేష్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి, సిబ్బంది నరేష్, కళావతి పాల్గొన్నారు.

గౌస్‌పీర్‌కు సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యావేత్త, సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటున్న పీస్ సయ్యద్ గౌస్ పీర్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని అభిమానులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కషి చేస్తూ, కడప నియోజకవర్గ పార్లమెంట్ ఇన్‌ఛార్జిగా కడప పార్లమెంట్ అభ్యర్థి షర్మిలా ఓట్ల శాతం పెరగడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. కడప నగరంలో కాంగ్రెస్ ఒక ఊపు తేవడంలో తనదైన శైలిలో ముందుకు వెళుతూ, కడప ప్రజలతో మమేకమై, ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కార దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు. లండన్‌లో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా తన ప్రతిభ చూపించారని పేర్కొన్నారు. కడప మీద ఉన్న మక్కువతో 12 ఏళ్లుగా పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషన్ స్కూల్స్ నడుపుతూ విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా ముందడుగులో ఉంటూ రాజకీయవేత్త అయినటువంటి పీస్ సయ్యద్ గౌస్ పీర్‌కి కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పించాలని కోరుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు అప్పగించిన కడప నియోజకవర్గం పార్లమెంట్ ఇన్‌ఛార్జి పదవిని సంపూర్ణంగా నిర్వర్తించి ఎంపీ షర్మిలా ఓట్ల శాతం కడప నియోజకవర్గంలో ఘననీయంగా పెరగడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. వైసిపి, టిడిపి పార్టీలకు సమానంగా తక్కువ సమయంలో కడప నియోజకవర్గంలోని ప్రజల రాబట్టగలగడంలో తన పాత్ర ఎంతో ఉందని అధిష్టానం గమనించాలని అభిమానులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. అధిష్టానం ఇచ్చే ఏ పదవి నైనా సమర్థతతో ముందుకు సాగుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కషి చేయగల సత్తా, తెలివి పీస్ సయ్యద్ గౌస్ పీర్‌కు ఉందని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో గౌస్‌పీర్ (ఫైల్‌ఫోటో)

ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పంటలను సాగు చేసే రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకొని పంటలను సాగు చేయాలని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లె గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు సాగు చేసిన పంటలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు చెందిన పంట పొలాల్లోకి వెళ్లి 2024 ఖరీఫ్‌కు చెందిన భూ సార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతా పంటలను సాగు చేయక ముందే పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించాలని సూచించారు. భూసార పరీక్షలు చేస్తే పంటలకు కావాల్సిన ఎరువులు వాడకంపై తక్కువగా ఉంటుందని చెప్పారు. మట్టి నమూనాలు సేకరించిన తర్వాత 10 రోజుల్లో ఫలితాలు వచ్చిన తర్వాత ఎరువుల మోతాదు వేసుకొన్నట్లతే పంటలు మంచి దిగుబడి వస్తాయని చెప్పారు. పంట దిగుబడి రావడంతో పాటు రైతుకు ఖర్చు తగ్గుతుందని చెప్పారు. భూ పరీక్షలపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న ఎడిఎ నరసింహారెడ్డి

గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టండి

ప్రజాశక్తి - బద్వేలు

గంజాయి విక్రయదారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పి. చాంద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి స్మగ్లర్లు విచ్చలవిడిగా గంజాయిని విక్రయించి యువకుల జీవితాలను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువగా విద్యార్థులు గంజాయి , మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారని, రాష్ట్రంలో ఉన్న ప్రతి కళాశాల, హాస్టళ్లను నెలలో రెండు సార్లు తనిఖీలు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు విద్యార్థులకు అలవాటు చేయడం కోసం స్మగ్లర్లు ప్రయత్నిస్తున్నారని వారిపై నిఘా ఉంచాలన్నారు.సమావేశంలో సిపిఎం నాయకులు రమణయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగింపు

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలో నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు తొలగించారు. వేంపల్లెలోని పులివెందుల - కడప - రాయచోటి రోడ్డు మార్గంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. విద్యుత్ మరమ్మతుల పనులు చేయడంతో విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. దీంతో ప్రజలు, వ్యాపారస్తులు కొంత ఇబ్బంది పడినప్పటికి విద్యుత్ స్తంభాలు రోడ్డుపై లేకుండా ఇతర ప్రాంతంలో కరెంటు స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రోడ్డు పనులు జరగలేదు. అయినప్పటికీ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను తొలగించారు.

చెత్తను పూర్తిగా తొలగించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉంచిన చెత్త కుండీలో ఉన్న చెత్తను పారిశుధ్య కార్మికులు పూర్తిగా తొలగించాలని వార్డు సభ్యులు ముత్యాల ఆంజనేయులు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లో రోజూ చెత్తను పూర్తిగా తొలగించిక పోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ చెత్తకుండీల్లో ఉన్న చెత్త మాత్రం తొలగించడం లేదని పేర్కొన్నారు. చెత్త పూర్తిగా తొలగించేలా పంచాయతీ అధికారులు, సర్పంచ్ చర్యలు చేపట్టాలని కోరారు. పంచాయతీలో రోజురోజుకూ సిబ్బంది సంఖ్య పెరిగినా చెత్త మాత్రం అలాగే చెత్త కుండీల్లో ఉంటోందని వాపోయారు. చెత్త కుండిల్లో పూర్తిగా చెత్తను తొలగించక పోవడంతో దోమలు కూడ విపరీతంగా పెరిగి పోతున్నట్లు చెప్పారు. దీని వల్ల ప్రజలు జర్వాల బారిన పడి ఆసుపత్రుల్లో డబ్బులు ఖర్చు చేసుకొంటున్నట్లు చెప్పారు. కాబట్టి దోమల ఉత్పత్తితో పాటు దుర్వాసన లేకుండా ఉండేందుకు చెత్తను పూర్తిగా తొలగించాలని కోరారు.

పరిసరాల శుభ్రత చాలా ముఖ్యం

ప్రజాశక్తి-కాశినాయన

గ్రామాల్లోని వీధులలో పరిసరాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే అంతలా వ్యాధులు కూడా దూరం అవుతాయని అడిషనల్ డిఎంహెచ్ఒ రవిబాబు పేర్కొన్నారు శుక్రవారం ఆయన మండల పరిధిలోని వడ్డమాను గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ వీధులు తిరిగి ఎక్కడైతే అపరిశుభ్రంగా ఉందో అక్కడ శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ జెఇ కి సూచించారు. ఇప్పటి నుండి ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లోని బోర్ల దగ్గరికి వెళ్లి అక్కడ ఏమన్నా లీకేజీలు ఉన్నాయా అని పరిశీలించారు. ఎక్కడ మురుగునీరు ఉంటే అక్కడ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. ఆయన వెంట సిహెచ్ఒ నిర్మల, సూపర్‌వైజర్ బాలయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ డిఎంహెచ్ఒ రవిబాబు

రోటరీ క్లబ్ గవర్నర్‌గా గోపాలకృష్ణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రోటరీ క్లబ్ గవర్నర్‌గా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సాధు గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న సాయంత్రం 6 గంటలకు ప్రొద్దుటూరు స్థానిక రెడ్ల కళ్యాణ మండపంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు, కర్ణాటకలోని ఎనిమిది జిల్లాలు కలిపి రోటరీ క్లబ్ గవర్నర్‌గా ఉంటారన్నారు. ఇంత పెద్ద బాధ్యతను తనపై నమ్మకం ఉంచి గవర్నర్‌గా నియమించినందుకు సంస్థ పెద్దలకు, ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజులలో రోటరీ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళతామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కే మల్లికార్జున, జిల్లా చీఫ్ సెక్రటరీ జాకీర్ అహమ్మద్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బత్తిన అశోక్‌కు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధకులు బత్తిన అశోక్ కు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. విశ్వవిద్యాలయం కామర్స్ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పరవేక్షణలో 'పర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ ఇండియన్ మ్యూచువల్ ఫండ్స్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీం (ఈ ఎల్ ఎస్ ఎస్)' అనే అంశం పైన పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంధాన్ని బత్తిన అశోక్ విశ్వవిద్యాలయ పరీక్షలు విభాగానికి సమర్పించారు. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకంలో నిర్మితులైన నిపుణుల బృందం పరిశోధకుడు అశోక్ రూపొందించిన పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధృవీకరించారు. పరిశోధకుడు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. మేరకు బత్తిన అశోక కు డాక్టర్ ప్రొసీడింగ్స్‌ను వైవీయూ పరీక్ష నిర్వహణ అధికారి డాక్టర్ నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి జారీ చేశారు.

ఉపాధి కూలీలను పట్టించుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉపాధి కూలీల జీవితాలు ఛిద్రమవుతున్నా అధికారులు పట్టించుకోరా అని సిపిఎం మండల కార్యదర్శి జి. ఏసుదాసు, పార్టీ కమిటీ సభ్యులు దాసరి విజయ్ సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలాగా కాకుండా ఎన్‌డిఎ కూటమి ఉపాధి కూలీల పైన నిజమైన విశ్వాసం చూపాలన్నారు. నాలుగు నెలలు (120) రోజులు కాలపరిమితి ఉన్నప్పటికీ రెండు నెలలు మాత్రమే ఉపాధి పని చేయించి మిగతా పని దినాలను మూట కట్టి అటకెక్కించారన్నారు. ఉపాధికూలీలకు ఎ అధికారులు వెంటనే 120 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాలు చాలా తక్కువ పడడంతో రైతు కూలీలు కూడా కరువుపైనే ఆధారపడ్డారని పేర్కొన్నారు. మరో 60 రోజులు అదనంగా కరువు పని కూలీలకు కల్పించాలని పేర్కొన్నారు. పని ప్రాంతాలలో ఉపాధి కూలీలకు భద్రత కల్పించాలన్నారు. గ్రామీణ ఉపాధి చట్టంలో పనికి ఉపయోగించే పరికరాలు ప్రభుత్వమే ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా కరువు పని అవసరాలకు ఉపయోగపడే పరికరాలు ఇవ్వాలన్నారు. జమ్మలమడుగు చుట్టుపక్కల మండలాలలో ఇప్పటివరకు ఆరు, ఏడు వారాలవుతున్నా ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించకపోవడం చాలా దారుణం అన్నారు. గ్రామీణ ఉపాధి ఫీల్డ్ ఆఫీసర్లు ఎవరికి తోచిన చేతివాటం వారు చూపిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాల పైన ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారన్నారు. ఏది ఏమైనా చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బస్సు యాత్ర సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వస్తే ఉపాధి కూలి రూ. 400 చేస్తామని పని భద్రత కల్పి స్తామని, ఉపాధి పరికరాలు తమ ప్రభుత్వమే ఇస్తుందని చెప్పిన మాటలు ఇప్పుడు గుర్తు చేశార న్నారు. లేనిపక్షంలో ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదాము, దివాకర్, కమల్ భాష , బాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అనుమానాస్పద కారు స్వాధీనం

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మండలం బసాపురం సమీపంలో కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉన్న కారును గుర్తించారు. కారును తనిఖీ చేయగా వాహనంలో నిత్యావసరుకులు ఉండడంతో ఎర్రచందనం తరలించే వారికోసం ఉంటుందన్న అనుమానంతో కారును బద్వేల్ ఫారెస్ట్ ఆఫీసుకు తరలించారు. వాహనం ఎవరిది అని ఆరా తీయగా బద్వేల్ కు చెందిన హబీబుల్లాగా గుర్తించి వారిని విచారించారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కానిస్టేబుల్ సెల్ఫ్ డ్రైవింగ్‌గా తీసుకుపోయినట్లు వాహన యజమాని తెలిపారు. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. సెల్ఫ్ డ్రైవింగ్ అని కారు తీసుకుపోయిన కానిస్టేబుల్ మీద ఎస్‌పికి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

బజాజ్ ఎలక్ట్రికల్ ఆటో ప్రారంభం

ప్రజాశక్తి - కడప : నగరంలోని కన్వెన్షన్ హాల్‌లో అరుణ్ బజాజ్ వారి నూతన 'బజాజ్ ఎలక్ట్రికల్ ఆటో' ను శుక్రవారం వైసిపి జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార రంగంలో మంచిగా రాణించి, ప్రజల మన్ననలను పొందాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు గజమాలతో ఘనస్వాగతం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా వస్తున్న సందర్భంలో నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. చాపాడు మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు అధిక సంఖ్యలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముని శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గురివిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, నారపురెడ్డి, సుదర్శన్, అక్బర్, హర్షవర్ధన్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, నారాయణరెడ్డి, నాయబ్ రసూల్, రామ్మోహన్ , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

సింహాద్రిపురం : మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-సింహాద్రిపురం

జులై ఒకటో 1న ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎపిఎంఐపి పీడీ, మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ఎంపిడిఒ సభ భవనంలో పింఛన్ల పంపిణీ పై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5623 మందికి ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయాలని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయ సిబ్బంది సోమవారం ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. ఎక్కడైనా పింఛన్ పంపిణీలో ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సల్మాన్ రాజ్, మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంపిణీ చేయాలి

చెన్నూరు : 1న నిర్వహించే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా చేపట్టాలని ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ, తహశీల్దార్ ప్రకాష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూడాలనాన్రు. గత ప్రభుత్వంలో రూ. 3000 ఉన్న పింఛన్లు, ప్రస్తుత ప్రభుత్వం రూ. 4000 పెంచిందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా మంత్రి చంద్రబాబు నాయుడు పెంచిన మొత్తాన్ని ఏప్రిల్ నుంచి లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారని, అందులో భాగంగా జులై 1న ప్రతి పింఛను దారుడికి రూ. 7000 చొప్పున పంపిణీ చేయాలని పేర్కొన్నారు. మండలంలో సుమారు 5450 మంది లబ్ధిదారులు ఉండగా అందుకుగాను పంపిణీ చేసేందుకు సుమారు 82 మంది సిబ్బంది నియమించినట్లు ఆయన చెప్పారు. ఇందుకుగాను సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖ సిబ్బందిని కూడా వినియోగించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి లబ్ధిదారుని గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను మొత్తాన్ని అందివ్వాలని వారు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్‌లో దాదాపు లక్ష మంది జనాభా ఉన్నప్పటికీ ఉర్దూ జూనియర్ కళాశాల లేకపోవడం చాలా విచారకరమని, వెంటనే స్పందించి పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఆవాజ్ పట్టణ అధ్యక్షులు సత్తార్ డిఇఒను కోరారు. శుక్రవారం ఆయన డిఇఒ అనురాధను కలిసి వినతి పత్రం అందజేశారు. అందుకు స్పందించిన డిఇఒ సమస్యను వెంటనే పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి బద్వేల్‌లో ఉన్న జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం సబ్జెక్ట్ ప్రవేశపెడతానని హామీ ఇచ్చారు.

క్రైస్తవులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి - కడప

ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో టిడిపి క్రైస్తవులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రెడీమి క్రైస్తవ పాస్టర్లు కోరారు. శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవిని వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా క్రైస్తవ ఇండిపెండెంట్ పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ క్రైస్తవ పాస్టర్ల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ జయరాజు, పాస్టర్ పి.మహేష్, పాస్టర్ ఇజ్రాయిల్, సిస్టర్స్ హెప్సిబా, సిస్టర్ రాజకుమారి, పాస్టర్ అబ్రహం, జాన్సన్, రాజన్న, దేవరాజు, ఐజక్, రవితేజ, క్రిస్టఫర్, జైపాల్, రమేష్, జాన్ పాల్, సాల్మన్ రాజు, సెల్వన్, నాగేంద్ర, రెడ్డప్ప, హరి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పూలమొక్కను అందిస్తున్న పాస్టర్లు

శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానము

(శివాలయము)

ప్రొద్దుటూరు టౌన్ (మం), కడప జిల్లా

వేలం ప్రకటన

కడప జిల్లా ప్రొద్దుటూరులో వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించిన క్రిందకనబరచిన షాపు రూములను నెల బాడగకు లీజుకు ఇచ్చుటకు గాను 02.07.2024వ తేది మంగళవారము మధ్యాహ్నం 02-00 గం॥ల నుండి ప్రొద్దుటూరు టౌన్ శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానము నందు దేవాదాయశాఖ అధికారుల సమక్షమున మూడు సంవత్సరముల కాలపరిమితికి బహిరంగవేలము వేయబడును.

షాపు విరములు

వ.నెం.	డోర్ నెం.	విస్తీర్ణము	ప్రదేశము
1)	9/487	19×11	శివాలయం వీధి
2)	9/488	19×11	శివాలయం వీధి
3)	9/488-1	19×11	శివాలయం వీధి
4)	9/488-2	19×11	శివాలయం వీధి
5)	9/488-3	19×11	శివాలయం వీధి
6)	9/488-4	19×11	శివాలయం వీధి
7)	9/488-5	19×11	శివాలయం వీధి
8)	9/488-6	19×11	శివాలయం వీధి
9)	9/488-7	19×11	శివాలయం వీధి
10)	9/488-8	19×11	శివాలయం వీధి
11)	9/488-10	19×11	శివాలయం వీధి
12)	9/488-11	19×11	శివాలయం వీధి
13)	9/488-12	19×11	శివాలయం వీధి
14)	9/488-13	19×11	శివాలయం వీధి

వేలం షరతులు

1. వేలయములో పాల్గొనదలచిన వారు రూ॥ 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) డిపాజిట్లు చెల్లించి వేలము పాటలో పాల్గొనవలయును.
2. హిందూ మతస్తులు కానివారు పాల్గొనరాదు
3. బహిరంగ వేలము ముగుసిన వెంటనే హెచ్చుపాటదారుడు 3 నెలల బాడుగను సెక్యూరిటీ డిపాజిట్ గా చెల్లించవలెను.
4. ఏ కారణము చేతనైనా దేవాదాయ శాఖ ధర్మాదాయశాఖ కమీషనరు వారు వేలమును రద్దు పరచిన యెడల హెచ్చుపాటదారుడు కట్టిన మొత్తమునకు వడ్డీ ఇవ్వకుండా సదరు పైకము వాపసు చేయబడును.
5. ఏ కారణము తెలుపకనే బహిరంగ వేలము వాయిదా వేయుటకుగాని రద్దుపరచుటకుగాని డిపార్టుమెంటు అధికారులకు మరియు కార్యనిర్వాహణాధికారికి అధికారము కలదు.
6. దేవస్థానమునకు ఎలాంటి బకాయలు ఉన్నవారు కాని ఇతర లావాదేవీలు ఉన్నవారు కాని పాటలో పాల్గొనరాదు.
7. బహిరంగ వేలమునకు ముందు సదరు షాపు రూములను చూచుకోని పాట పాడుకొనవలయును.
8. షాపు రూములు, ఖాళీ స్థలము ప్రస్తుతము వున్న కండీషన్లో హెచ్చుపాటదారునికి స్వాధీనము చేయబడును. మిగతా షరతులు వేలము సమయము నందు తెలుపబడును.

ఇట్లు

శ్రీ కొత్తమిద్దె రఘురామి రెడ్డి
చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి

శ్రీ సి. శంకర బాలాజీ
కార్యనిర్వహణాధికారి

తేది: 22-06-2024